క్లుప్తంగా

పాడిరైతులకు బోనస్ పంపిణీ



కూచిపూడి(మొవ్వ): మండలంలోని కూచిపూడిలో పాలసేకరణ కేంద్రంలో 2023-24 సంవత్సరానికి సంబంధించి మంగళవారం బోనస్ పంపిణీ చేశారు. 63 మంది సభ్యులకు రూ. 33,648లను పంపిణీ చేశారు. సొసైటీ అధ్యక్షురాలు పైడిపాముల మనోహరం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈకార్యక్రమంలో రూట్ సూపర్వైజర్ కైలా రమేష్, వేతన కార్యదర్శి మహంకాళి సత్య శ్రీనివాస్, టెస్టర్ లంకపల్లి సుబ్రహ్మణ్యం, సభ్యులు పాల్గొన్నారు.

గుంటూరు బాపనయ్యకు ఘననివాళి



గుడివాడటౌన్: స్థానిక సీపీఎం కార్యాలయంలో మంగళవారం కామ్రేడ్ గుంటూరు బాపనయ్య 47వ వర్ధంతిని నిర్వహించారు. ఆపార్టీ నాయకులు తొలుత బాపనయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి ఆర్ సీపీ రెడ్డి మాట్లాడుతూ మూడుసార్లు ఎమ్మెల్యేగా, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షునిగా, కార్యదర్శిగా రైతుల సమస్యలపై అలుపెరుగని పోరాటం చేసిన గొప్పనాయకుడు బాపనయ్య అని కొనియాడారు. నీతి, నిజాయితీ, నిబద్ధతకు బాపనయ్య మారుపేరుగా నిలిచారని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఆర్.కొండ, ఎల్.సురేంద్ర, ఎస్.రాంబాబు, ఎస్.శ్రీనివాసరావు, బి.సాంబశివరావు, వైవీ సుబ్బారావు, అవిర్నేని వెంకటేశ్వరరావు, కృష్ణకిషోర్, జి.గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

వీరాంజనేయునికి విశేష పూజలు



పామర్రు: ఫాల్గుణ మాసం ఏకాదశి చివరి మంగళవారం నేపథ్యంలో ఉండ్రపూడి-పోలవరం అడ్డరోడ్డు వద్ద వేంచేసియున్న శ్రీ వీరాంజనేయస్వామి ఆలయంలో భక్తులు విశేష పూజలు చేశారు. తొలుత ఆలయంలో స్వామికి ఆవుపాలు, పంచామృతాలతో ప్రత్యేకంగా అభిషేకాలు నిర్వహించారు. అనంతరం నాగవల్లీలతో శతనామ అష్టోత్తర పూజలు జరిపారు. భక్తులు పాల పొంగళ్లను పెట్టి మొక్కులు చెల్లించుకున్నారు. కొత్త వాహనాలను కొనుగోలు చేసుకున్న వారు ప్రత్యేక పూజలు జరిపించుకున్నారు. ఆలయంలో పూజా కార్యక్రమాలను ఆలయ అర్చకులు అగ్నిహోత్రం దినకర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. సహాయకులుగా ఫణి, శర్మ వ్యవహరించారు. కార్యక్రమంలో ఆలయ అధికారి ప్రసాద్, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

200 మందికి వైద్యపరీక్షలు



నందివాడ: మండలం లక్ష్మీనరసింహాపురంలో డాక్టర్ ఎన్టీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శ్రీసురక్ష హాస్పిటల్ వారిచే మంగళవారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో వైద్యులు డాక్టర్ జగదీష్, డాక్టర్ అభిషేక్ హాజరై 200మందికి వైద్యపరీక్షలు చేశారు. గుండె, బీపీ తదితర వ్యాధులతో బాధపడుతున్న వారిని గుర్తించి మందులు పంపిణీ చేశారు. మెరుగైన ఆరోగ్యం కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆర్ఎంపి డాక్టర్ శ్యామ్, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



మండవల్లి: మండలంలోని పెరికెగూడెంలోని శ్రీధర్మశాస్త్ర మణికంఠ స్వామి ఆలయ నాలుగో వార్షికోత్సవాన్ని మంగళవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. అయ్యప్ప స్వామికి పంచామృతాలతో అభిషేకాలు చేశారు. ఆలయ అర్చకులు దివి శశిగోపాలాచార్యులు, భావ సత్యనారాయణాచార్యులు కలసి శ్రీగణపతిస్వామికి, శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, మాలికాపురత్తమ్మ, శ్రీ స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు, నిర్వహించారు. అనంతరం భారీ అన్నసమారాధన నిర్వహించారు.

యాంత్రీకరణతో మినుము రైతుకు ఊరట

- వ్యవసాయ ఖర్చులు ఆదా..
- గంటల్లోనే నూర్పిళ్లు పూర్తి

గుడ్లవల్లేరు: యాంత్రీకరణతో మినుము రైతుకు ఊరట లభించింది. మినుము తీత పనుల్ని కూలీలతో చేయిస్తే ఎకరానికి రూ.14,500 ఖర్చవుతుండగా, యాంత్రీకరణతో ఈ ఖర్చు కేవలం రూ.3వేలకు పరిమితమవుతుండటంపై రైతులు హర్షం వ్యక్తంచేస్తున్నారు. గుడ్లవల్లేరు, అంగలూరు తది తర గ్రామాల్లో మినుము పొలాల్లోని పంటను రైతు లు కోత యంత్రాలతో కోయిస్తున్నారు. కాయతీత లు, కుప్పనూర్పిళ్ల లేకుండానే గంటల వ్యవధిలోనే పంట దిగుబడులు రైతుల చేతికి అందుతున్నాయి.

ఎకరానికి మినుము తీతలు, నూర్పిడికి వెరశి రూ.14,500 ఖర్చవుతోంది.యంత్రంతో పొలాన్ని కోయిస్తే ఎకరానికి రూ.3వేలు ఖర్చవుతుందని రైతులు చెబుతున్నారు. యంత్రం ద్వారా ఎకరా మినుము పంట కోతకు గంటన్నరలోపే పూర్తవుతుంది. మినుములను బస్తాల్లోకి ఎత్తించుకునేందుకు వీలుగా మిషన్ పనిచేస్తుండటంతో తమకు ఉపయుక్తంగా ఉంటోందని రైతులు చెబుతున్నారు. మండే ఎండలకు కూలీల డిమాండ్ ఎక్కువ కావడంతో ఆ ఇబ్బందులు లేకుండా రైతులు యంత్రం ద్వారా కోతలు కోయిస్తున్నారు.

సాగుభూమికి నైట్రోజన్ లభ్యం...

మినుము తీతల తర్వాత ఆ చెత్తను రైతులు కాల్చేస్తారు. కాని మిషనుతో మినుమును కోశాక, పొట్టును పొలంలోనే చల్లేస్తే, సాగుభూమిలో నైట్రోజన్ శాతం పెరుగుతుందని వ్యవసాయ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఆ తర్వాత పంటలకు బలం చేకూరుతుంది. పంటలో మిగిలిన పొట్టు భూమికి ఎంతో ఉపయుక్తమవుతోంది. రాబోయే పంటలకు మంచి పోషకాలు ఇస్తుందని వ్యవసాయ శాస్త్రవేత్తలు చెబుతున్నారు.ఈ యాంత్రీకరణ పద్ధతిలో మినుముతీతల కారణంగా ఓ బస్తా మినుములు రాలిపోయే అవకాశం ఉంది. మినుమును యంత్రంతో కోయించడం ద్వారా వలన మినుము కూడా బద్దయ్యే అవకాశం ఉంది. కూలీల ఖర్చు కలిసి వచ్చినా పంట తరుగుపోను రూ.2వేల వరకు వ్యవసాయ ఖర్చులు ఆదా అవుతాయి. ఏది ఏమైనా ఈ యాంత్రీకరణతో కూలీల కొరతను తగ్గిస్తున్నట్లు రైతులు చెబుతున్నారు.



కోత అనంతరం మినుములను ట్రాక్టర్‌లోకి పోస్తున్న యంత్రం



మినుము కోస్తున్న హార్వెస్టర్

ఖర్చులు కలిసి వస్తున్నాయి...



యంత్రంతో మినప తీత పనులను చేపట్టడంతో ఎకరానికి రూ.2వేల ఖర్చుతో బయట పడుతున్నాం. కాయతీతలు, నూర్పిళ్ల ఖర్చులు కలిసి వస్తున్నాయి. గంటన్నరలోనే మినుములను బస్తాల్లోకి ఎత్తుకునేందుకు అవకాశం ఉంది. పండిన పంట గూటికి చేర్చుకునేందుకు ఈ విధానం ఉపయోగపడుతుంది.

– బొర్రా ప్రసాద్, పురిటిపాడు రైతు(గుడ్లవల్లేరు మండలం)

మినుముకు ధర ఏది?..



మార్కెట్లో మినుములకు సరైన ధర లేకుండా పోయింది. పండిన పంటకు రేటు లేకపోయినా యంత్రంతో కోత కోయించడం ద్వారా కొంత ఖర్చులు కలిసి రావటంతో ఊరట లభిస్తుంది. పంటలో కోత కోయిగా మిగిలిన పొట్టుతో పోషకాల కారణంగా సాగు భూమికి ఎంతో సత్తువ వస్తుంది.

– డాక్టర్ తీట్ల వీరయ్య, గుడ్లవల్లేరు రైతు

ఉపాధి పనులపై సమీక్ష

తోట్లవల్లూరు: ఉపాధిహామీ పనులు ముమ్మరంగా సాగేలా ఫీల్డ్‌అసిస్టెంట్లు చూడాలని డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ ఎస్.శివప్రసాద్‌యాదవ్ ఆదేశించారు.ఉపాధి హామీ పథకం కింద 2023-24లో చేపట్టిన ఉపాధి పనులపై స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో మంగళవారం సామాజిక తనిఖీ ప్రజావేదికను నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన శివప్రసాద్ యాదవ్ మాట్లాడుతూ గ్రామాల వారీగా ఉపాధి పనుల నిర్వహణ, వేతనాల చెల్లింపుపై తనిఖీ బృందాలు అందించిన నివేదికలను పరిశీలించారు. పనుల నిర్వహణ, వేతనాల చెల్లింపుల్లో పొరపాట్లు లేకుండా చూసుకోవాలని ఫీల్డ్‌అసిస్టెంట్లను మందలించారు. గ్రామాల్లో ఉపాధి పనులు ఎక్కువగా జరిగేలా చూడాలని, అడిగిన వారందరికీ పని కల్పించాలని సూచించారు. ఎంపీపీ ఈడ్పుగంటి రాజామణి, ఎంపీడీఓ కేఎస్ రవికాంత్, సీడీడీ ఎల్ఆర్‌సీ రామ్మోహన్, ఏపీడీ లక్ష్మీరెడ్డి, డీవీఓ సురేష్, వైస్ ఎంపీపీ కళ్లం శివారెడ్డి, తోట్లవల్లూరు, రొయ్యూరు, గురివిందపల్లి సర్పంచులు పెనుమత్స రాధిక, నిమ్మగడ్డ ప్రభుదాస్, ఉమ్మడిశెట్టి ఉదయభాస్కర్, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.



తోట్లవల్లూరులో ఉపాధి పనులపై సమీక్ష నిర్వహిస్తున్న డ్వామా పీడీ శివప్రసాద్‌యాదవ్

జామాయిల్ తోట పాక్షిక దగ్ధం

తోట్లవల్లూరు: గ్రామంలోని వేములపల్లి తేజశ్వినికి చెందిన జామాయిల్ తోటకు సోమవారం రాత్రి మంటలు అంటుకోవడంతో పాక్షికంగా దగ్ధమైంది. సమాచారం అందుకున్న ఉయ్యూరు ఫైర్ సిబ్బంది హుటాహుటిన సంఘటనాస్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ప్రమాదానికిగల కారణాలు తెలియరాలేదు. ఈ ఘటనలో రూ. 20వేల వరకు నష్టం వాటిల్లినట్లు ఇన్‌చార్జి ఫైర్ అధికారి ఎం.గౌతమ్ తెలిపారు.

నేడు ఎముకల వైద్యశిబిరం

గుడివాడటౌన్: స్థానిక రాజేంద్రనగర్ లోని జీవీ పూర్ణచంద్రరావు కమ్యూనిటీ హాలులో రోటరీక్లబ్ ఆఫ్ గుడివాడ ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం ఐదుగంటలకు ఉచిత ఎముకల వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు క్లబ్ అధ్యక్షుడు టీఎస్ రాజశేఖర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరంలో డాక్టర్ వి. ప్రేమ్‌కుమార్ ఆధ్వర్యంలో వైద్యపరీక్షలు చేస్తారన్నారు. ఆధునిక ఆర్థోపెడిక్ మాన్యువల్ థెరపీ ద్వారా గురించి అవగాహన కల్పించనున్నట్లు వివరించారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఉపాధి పనుల్లేక ఇబ్బందుల్లో కూలీలు

ముదినేపల్లి రూరల్: చెరువు తవ్వకంతో ఉపాధి హామీ పనులు కల్పించాలని మండలంలోని వైవాక గ్రామ దళితులు కోరుతున్నారు. గ్రామంలోని పొలాలన్నీ చేపల చెరువుల మయం కావడంతో వ్యవసాయ పనులు లేకుండా పోయాయి. దీంతో ఉపాధి కూలీలకు ఎక్కువ రోజులు పనులు దక్కడం లేదు. వేసవిలో ఎలాంటి పనులు లేక ఆర్థికంగా సమస్యలు ఎదుర్కోవలసి వస్తున్నందున, ఇందుకు ప్రత్యామ్నాయంగా స్థానిక పెదగరువులో ఉన్న ఊరచెరువును అరబెట్టి తవ్వకం పనులు చేపడితే ఉపాధి కూలీలకు పనులు దొరికే అవకాశం ఉంది. చెరువులో ఉన్న కొద్దిమేర నీటిని బయటకు తోడించి చెరువును ఆరగడితే ఉపాధి హామీ పథకం కింద తవ్వకం పనులు చేపట్టవచ్చు. తద్వారా చెరువు శుభ్రం కావడంతో పాటు పశువులకు అన్నిరోజులు సమృద్ధిగా నీరు దొరికే అవకాశం ఉంటుందని కూలీలు చెబుతున్నారు.

రాములోరి కల్యాణానికి గోటి తలంబ్రాలు

ముదినేపల్లిరూరల్: మండలంలోని సింగరాయపాలెం బావాజీ మఠంలోని కోదండరామాలయ స్వామి ఆలయంలో శ్రీరామనవమి పండుగ సందర్భంగా నిర్వహించే సీతారాముల కల్యాణానికి స్థానికులు గోటి తలంబ్రాలను సిద్ధం చేస్తున్నారు. భద్రాచలంలో జరిగే రాములోరి కల్యాణాన్ని ఆదర్శంగా తీసుకుని ఇక్కడ ఆలయంలో అంగరంగ వైభవంగా కల్యాణతంతు నిర్వహిస్తారు. ఈసందర్భంగా స్థానికులు గోటి తలంబ్రాలను కల్యాణానికి అందజేస్తారు. ఏప్రిల్ 6వతేదీన శ్రీరామనవమి సందర్భంగా జరిగే కల్యాణానికి గోటి తలంబ్రాలు సిద్ధం చేసే కార్యక్రమాన్ని ఆలయ అర్చకుడు ఆసూరీ రంగానాధాచార్యులు(చిన్నారి స్వామీ) సోమ, మంగళవారాల్లో నిర్వహించారు. వీటిని స్థానికులు గోటితో వలిచి కల్యాణం ముందురోజు ఆలయంలో అందజేస్తారు.

ఆక్రమణల తొలగింపుపై మీనమేషాలు

కూచిపూడి(మొవ్వ) ప్రపంచ ప్రసిద్ధి గాంచిన నాట్య క్షేత్రం కూచిపూడి ప్రధానకూడలిలోని ఆక్రమణల తొలగింపుపై గ్రామ పంచాయతీ అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. కూచిపూడిలోని బస్టాండ్ (పసుమర్తి వారి ధర్మ చెరువు)చుట్టూ ఉన్న 42మంది దుకాణదారులు చేసిన ఆక్రమణలను తొలగించాలంటూ హైకోర్టు ఏడాది కిందటే పంచాయతీ పాలకులకు ఆదేశాలు జారీచేసింది. అయినప్పటికీ ఆ ఆదేశాలు పట్టించుకున్నవారే లేరు. పంచాయతీ అధికారులు దుకాణదారులకు నోటీసులు ఇవ్వడం, గడువు కోరుతూ వారు స్టే తెచ్చుకోవడం పరిపాటిగా మారింది. కార్యదర్శి కే పుష్పనాథం ఈ అంశాన్ని పట్టించుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తున్నాయి. ఇకనైనా పంచాయతీ పాలకులు స్పందించి ఆక్రమణలు తొలగించాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఇదిలాఉండగా తమ దుకాణాలకు పన్నులు కట్టించుకోవటం లేదంటూ ఆక్రమణదారులు సోమవారం జిల్లా కేంద్రం మచిలీపట్నంలో జరిగిన మీకోసం కార్యక్రమంలో పంచాయతీ అధికారులపై ఫిర్యాదు చేయడం కొసమెరుపు.



ఆక్రమిత స్థలాల్లో కొనసాగుతున్న దుకాణాలు

రేషన్‌కార్డుల ఈకేవైసీ పూర్తిచేయాలి

పెదపారుపూడి: మండలంలోని అన్ని గ్రామాల్లో ఉన్న రేషన్‌కార్డుల ఈకేవైసీ కార్యక్రమాన్ని డీలర్లు వెంటనే పూర్తిచేయాలని తహసీల్దార్ వై. రంగారావు ఆదేశించారు. తన కార్యాలయంలో మంగళవారం ఆయన మండలంలోని రేషన డీలర్లు, ఎండీయు వాహనదారులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ మండలంలో సుమారు 1900 కార్డుదారులకు ఈకేవైసీ చేయాల్సి ఉందన్నారు. డీలర్లు వెంటనే ఇంటింటికీ వెళ్లి త్వరితగతిన పూర్తిచేయాలని అదేశించారు. కార్యక్రమంలో సివిల్‌సప్లయిస్ డీటీ కిరణ్ పాల్గొన్నారు.

నవోదయ పరీక్షల్లో ఇద్దరు ఉత్తీర్ణత

కైకలూరు: నవోదయ పరీక్షల్లో కైకలూరు మండలానికి చెందిన ఇద్దరు విద్యార్థులు ఉత్తీర్ణత సాధించి వేలేరు నవోదయ కేంద్రంలో సీట్లు సాధించారు. ఈ ఏడాది జనవరి 18న నిర్వహించిన నవోదయ పరీక్ష ఫలితాలు మంగళవారం వెలువడ్డాయి. కైకలూరు టౌన్‌స్టేషన్ కానిస్టేబుల్ కె.రవికుమార్ కుమారుడు రేవంత్ నాగసాయి కైకలూరు భాష్యం స్కూల్ నుంచి, ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ వద్ద గన్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్న వరహాపట్నంకు చెందిన సీహెచ్.భూషణం కుమార్తె తన్మిక ఆటపాక శ్రీచైతన్య పాఠశాల నుంచి నవోదయ పరీక్షలు రాశారు. కైకలూరుకు చెందిన నాగ దత్తు శిక్షణనిచ్చారు. ప్రతిభచూపి నవోదయ సీట్లు సాధించిన విద్యార్థులను స్థానికులు అభినందించారు.





రేవంత్ నాగసాయి తన్మిక

చోరీల నియంత్రణకు చర్యలు : ఎస్ఐ

పామర్రు: గ్రామాల్లోని ఆలయాల్లో చోరీలు చోటుచేసుకోకుండా పాటించాల్సి జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు పామర్రు ఎస్ఐ రాజేంద్రప్రసాద్ తెలిపారు. మండల పరిధి జుఝువరంలోని ప్రజలకు మంగళవారం ఆయన అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తరచూ కొన్ని గ్రామాల్లోని ఆలయాల్లో దొంగతనాలు, హుండీల చోరీలు జరుగుతుండటంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. చోరీల నియంత్రణకు గస్తీ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. చోరీలను అరికట్టేందుకు గ్రామాల్లో యువత సహకరించాలని కోరారు. పోలీసుశాఖకు సంబంధించిన యాప్‌ల వినియోగంపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.



జుఝువరంలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ రాజేంద్ర ప్రసాద్

సుబ్బారాయుడికి అభిషేకాలు

ముదినేపల్లి రూరల్: ప్రసిద్ధి చెందిన సింగరాయపాలెం-చేవూరుపాలెం సెంటర్‌లోని శ్రీసుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో స్వామివారికి మంగళవారం అభిషేకాలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు తోలేటి వీరభద్రశర్మ ఆధ్వర్యంలో స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. భక్తులు స్వామివారి పుట్టలో పాలు పోసి, నాగబంధాల వద్ద పూజలు చేసి అభిషేకాలు చేయించుకున్నారు. ఆయా కార్యక్రమాలను ఈఓ ఆర్.గంగాశ్రీదేవి, సిబ్బంది పర్యవేక్షణ చేశారు.



పూజల్లో పాల్గొన్న భక్తులు

నేటి నుంచి అమ్మవారి చీరల వేలం

కైకలూరు: స్థానిక శ్యామలాంబ అమ్మవారి దేవస్థానంలో భక్తులు సమర్పించిన చీరలను ఈనెల 26 తేదీ నుంచి 28వ తేదీ వరకు మూడు రోజుల పాటు బహిరంగ వేలం నిర్వహిస్తామని ఆలయ ఈఓ వీఎన్‌కే శేఖర్ మంగళవారం చెప్పారు. దేవస్థానం వద్ద నిర్వహించే ఈ వేలంలో ఆసక్తిగలవారు పాల్గొనాలని ఈఓ కోరారు.

ఆర్వోబీ పనులకు సాంకేతిక అనుమతులు : ఎమ్మెల్యే

గుడివాడరూరల్: గుడివాడలో రైల్వే ఓవర్ బ్రిడ్జి(ఆర్వోబీ) నిర్మాణ పనులు వేగవంతంగా జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము తెలిపారు. రాజేంద్రనగర్‌లోని తన స్వగృహంలో మంగళవారం ఆయన జాతీయ రహదారుల అథారిటీ అధికారులతో ఆర్వోబీ నిర్మాణ పనులపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టణంలో జరుగుతున్న రైల్వేగేట్ల వద్ద నిర్మాణ పనులు ముమ్మరంగా సాగుతున్నాయన్నారు. రైల్వేశాఖ నుంచి సాంకేతిక అనుమతులు వచ్చాయని, ఇతర అనుమతులు మంజూరుకు కృషి చేస్తున్నామన్నారు. ప్రధానంగా గేట్లపై బ్రిడ్జి నిర్మాణ పనులు మొదలుపెట్టిన తర్వాత అత్యధిక రోజులు గేట్లు మూయాల్సి వస్తుందని, గేట్లు మూసి ఉంచే రోజులను తగ్గించడమేగాకుండా వాహనదారులకు ఇబ్బందులు లేకుండా తగిన చర్యలు గతీసుకుంటున్నామన్నారు. 216జాతీయ రహదారి అందుబాటులోకి రానుందన్నారు. అండర్ పాస్ నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేస్తామన్నారు. ఆర్వోబీ నిర్మాణం పూర్తి కావడానికి ఉన్న అడ్డంకులను ఒక్కొక్కటిగా అధిగమిస్తూ నిర్మాణ పనులు వేగవంతమయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. గుడివాడ బస్టాండ్ సెంటర్ నుంచి వాసవీచౌక్, మార్కెట్ సెంటర్, బంటుమిల్లి రోడ్ మీదుగా బైపాస్‌రోడ్డు వరకు రోడ్డుకు ఇరువైపులా ఫుట్‌పాత్‌పై రైలింగ్ ఏర్పాటు పనులు, ఐఎంఏ రోడ్డు అభివృద్ధి పనులు త్వరలో ప్రారంభమవుతాయన్నారు. సమావేశంలో నేషనల్ హైవే ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జి.సంజీవరాయుడు, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ డి.శరత్‌చంద్ర, ప్రాజెక్టు మేనేజర్ ఎన్.శ్రీనివాస్, టీం లీడర్ దివాకర్, రెసిడెన్స్ ఇంజినీర్ బి.నిరంజనరావు, వల్లభనేని కన్‌స్ట్రక్షన్ ఎండీ వి.వెంకటేశ్వరరావు, టీడీపీ నాయకుడు పెద్ది శ్రీకాంత్ పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

రాజ్యాంగంపై అవగాహన అవసరం

మొవ్వ: విద్యార్థులంతా తప్పనిసరిగా భారత రాజ్యాంగంపై అవగాహన కలిగి ఉండాలని కూచిపూడి ఎస్ఐ కె.నాగవిశ్వనాథ్ సూచించారు. మొవ్వలోని వేమూరి సుందర రామయ్య ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో రాజనీతిశాస్త్రం, హిస్టరీ, ఎకనామిక్స్, ఐక్యూఏసీ విభాగాలు సంయుక్తంగా రెండునెలలుగా భారత రాజ్యాంగంపై నిర్వహించిన సర్టిఫికెట్ కోర్స్ మంగళవారంతో ముగిసింది. ఈసందర్భంగా కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఎస్ఐ నాగవిశ్వనాథ్ పాల్గొని విద్యార్థులకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.మాధవి అధ్యక్షత వహించగా, వైస్ ప్రిన్సిపాల్ కేర్ మంజుల, సర్టిఫికెట్ కోర్స్ కన్వీనర్ డాక్టర్ ఎం.సుందరరావు, అధ్యాపకులు కెప్టెన్ ఆర్. వెంకయ్య, జి.సురేష్‌బాబు, ఎల్.వి.కృష్ణారావు, ఎస్.కృష్ణమోహన్, డాక్టర్ సిహెచ్ ఆనంద్ కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు



సర్టిఫికెట్ అందిస్తున్న కూచిపూడి ఎస్ఐ నాగవిశ్వనాథ్, ప్రిన్సిపాల్ మాధవి

పారిశ్రామిక ప్రోత్సాహకానికి రిజిస్ట్రేషన్లు

గుడివాడటౌన్: ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేందుకు రాష్ట్రప్రభుత్వం అడుగులు వేస్తోందని ముడా చైర్మన్ మట్టా ప్రసాద్ అన్నారు. స్థానిక ఎన్జీటీఎస్ హోమ్‌లో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలను ప్రోత్సహించేందుకు మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ప్రోత్సాహకాలు పొందాలంటే రిజిస్ట్రేషన్ తప్పనిసరి అన్నారు. ప్రతి పారిశ్రామికవేత్తలు వారి యూనిట్లకు సంబంధించి సర్టిఫికెట్లు పొందాలన్నారు. అప్పుడే ప్రభుత్వం ఇచ్చే రాయితీలు పొందేందుకు వీలుకలుగుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా పారిశ్రామిక కేంద్రం జనరల్ మేనేజర్ ఆర్.వెంకట్రావు, ఎంపీడీఓ విష్ణు ప్రసాద్, ఇండస్ట్రియల్ ప్రమోషన్ అధికారి మనోజ్, సీఐటీయూ పట్టణ కార్యదర్శి లక్ష్మణరావు, బీజేపీ నాయకుడు శివాజీ, అబ్దుల్ హమీద్, అబ్దుల్ ఖుద్దూస్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మట్టా ప్రసాద్

చలివేంద్రం ప్రారంభం

పామర్రు: వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు ఎంతగానో దోహదపడతాయని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా అన్నారు. స్థానిక నాలుగురోడ్ల కూడలి వద్ద పామర్రు పంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన మంగళవారం ప్రారంభించారు. తొలిరోజు చల్లని మజ్జిగతో పాటు తాగునీటిని పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా మాట్లాడుతూ బాటసారులు, ప్రజలు ఈచలివేంద్రాలను వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ప్రాజెక్టు కమిటీ ఉపాధ్యక్షులు వల్లూరిపల్లి గణేష్, నాయకులు కుదరవల్లి ప్రవీణ్ చంద్ర, దాలిపర్తి శ్రీనివాసరావు, గ్రామకార్యదర్శి అబ్దుల్ సలీం, గ్రామ శానిటరీ ఇన్స్పెక్టర్ సుభాకర్ పాల్గొన్నారు.

పచ్చనేతల సేవలో కార్యదర్శి..

గ్రామపంచాయతీ పాలకవర్గం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్ర కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు పాల్గొనక పోవడం గమనార్హం. గ్రామ కార్యదర్శి కనీసం పాలకవర్గానికి సమాచారం కూడా ఇవ్వకుండా ఏక పక్షంగా వ్యవహరిస్తూ పచ్చనేతల సేవలలో తరిస్తున్నారని విమర్శలు గ్రామస్తుల నుంచి వినిపిస్తున్నాయి. పచ్చనేతలను ప్రసన్నం చేసుకునేలా చలివేంద్రం దిమ్మలకు పసుపు రంగు వేయడం విమర్శలకు తావిస్తోంది. పాలక మండలి సభ్యులు వైఎస్సార్‌సీపీకి చెందిన వారు కాగా, అధికారంలో ఉన్న కూటమి నాయకుల ప్రసన్నం చేసుకునేందుకు కార్యదర్శి ఇలా వ్యవహరించారనే విమర్శలు వినిపిస్తున్నాయి.



పామర్రులో చలివేంద్రం ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా తదితరులు

కేబుల్ వైర్ల చోరీపై కేసు నమోదు

సాక్షి ఎఫెక్ట్

తోట్లవల్లూరు: వ్యవసాయ మోటార్లకు సంబంధించిన విద్యుత్ కేబుల్ వైర్ల చోరీపై పోలీసులు ఎట్టకేలకు స్పందించి కేసులు నమోదు చేశారు. మండలంలోని వల్లూరుపాలెం, తోట్లవల్లూరు, పాములలంక, చాగంటిపాడు, కళ్లంవారిపాలెం, పెనమకూరు గ్రామాల పరిధిలోని లంక, మాగాణి పొలాలలో వరుసగా జరుగుతున్న కేబుల్ వైర్ల చోరీపై ఈనెల 23న 'మోటారు వైర్ల చోరీతో రైతుల ఆందోళన' శీర్షికతో 'సాక్షి' దినపత్రిక ఓ కథనం ప్రచురించడం విదితమే. ఈ విషయమై ఉన్నతాధికారుల ఆదేశాలతో పోలీసులు స్పందించారు. కేబుల్ వైర్ల చోరీకి గురైన బాధిత రైతులను మంగళవారం తోట్లవల్లూరు ఎస్ఐ అవినాశ్ స్థానిక పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి విచారించటంతోపాటు ఫిర్యాదులు స్వీకరించారు. ఇప్పటి వరకు 190 మోటార్ల వద్ద 950 మీటర్ల వైరు చోరీకి గురైనట్లు రైతులు తమ ఫిర్యాదుల్లో పేర్కొనగా, ఈ మేరకు నాలుగు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అవినాశ్ తెలిపారు.

ఫ్యూజ్‌లు ఏర్పాటు

మండవల్లి: మండవల్లి మొగలిచెరువు రక్షిత నీటి పథకానికి చెందిన పంపుహౌస్ వద్ద ఫ్యూజ్‌లు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని సర్పంచ్ మెండా ఝాన్సీ, సురేష్ పరిశీలించారు. తాగునీటి సరఫరాకు ఇబ్బంది లేకుండా ఫ్యూజ్‌లు ఏర్పాటు చేయించినట్లు వారు వివరించారు.

నేడు హుండీల లెక్కింపు

కైకలూరు: రాష్ట్రంలో ప్రసిద్ధి చెందిన కొల్లేటికోట పెద్దింట్లమ్మ దేవస్థాన హుండీల లెక్కింపు కార్యక్రమం బుధవారం ఉదయం 10 గంటలకు ఆలయం వద్ద ప్రారంభమవుతుందని ఈఓ కూచిపూడి శ్రీనివాసు మంగళవారం తెలిపారు. గుడివాడ దేవదాయశాఖ అధికారి సుధాకర్ పర్యవేక్షణలో నిర్వహించే ఈ హుండీ లెక్కింపులో ఆసక్తి కలిగిన భక్తులు పాల్గొనాలని ఈఓ కోరారు.